క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



గుల్లలపాలెంలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లల పాలెం వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో కాలనీ వాసులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారన్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని జీవీఎంసీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజినీరింగ్ వర్క్స్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు



కాలువల్లో వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్షమించేది లేదని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ హెచ్చరించారు. వార్డు పరిధి మల్కాపురం,ప్రకాష్‌నగర్,ఆర్‌కే పురం తదితర ప్రాంతాల్లో బుధవారం ఆమె పర్యటించారు. కాలువల్లో వ్యర్థాల తొలగింపులో కార్మికులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవితో కలిసి ఆయా ప్రాంతాలను సందర్శించి సమస్యను చూపించారు.తక్షణం వాటిని తొలగించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం తొలగింపు పనులను ఆమె దగ్గరుండి పర్యవేక్షించారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు,శానిటరీ,మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వెంకటాద్రిపై బుధవారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు.

జీవీఎంసీ క్రికెట్ జట్టు ఘన విజయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ క్రికెట్ జట్టు ఎన్నారై ఆస్పత్రి జట్టుపై ఘన విజయం సాధించింది. జింక్ మైదానంలో విశాఖ డిస్ట్రిక్ట్ క్రికెట్ అకాడమీ ఇన్‌స్టిట్యూషన్స్ పూల్‌-సీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో జీవీఎంసీ, ఎన్ఆర్ఐ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో జీవీఎంసీ జట్టు రెండు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిందని అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. ముందుగా బ్యాటింగ్ చేసిన ఎన్నారై హాస్పటల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేయగా, లక్ష్మీప్రసాద్ 29, సునీల్ 40 పరుగులు చేశారు. జీవీఎంసీ తరపున కెప్టెన్ శివ 3 వికెట్లు, అనీల్ 3 వికెట్లు, రాజు 2 వికెట్లు తీశారు. జీవీఎంసీ జట్టు 8 వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని చేరింది. నరేష్‌కుమార్ 24, సునంద్ 33, ప్రకాష్ 28 పరుగులు చేసి జీవీఎంసీ విజయానికి దోహదపడ్డారు.

మానసిక ఆస్పత్రిలో వసతులు భేష్



ప్రభుత్వ మానసిక ఆస్పత్రి ప్రాంగణం



పీజీ విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న డిజిటల్ లైబ్రరీ

- ఆహ్లాదం పంచేలా మౌలిక సదుపాయాలు
- పీజీ విద్యార్థులకు అధునాతన డిజిటల్ లైబ్రరీ

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రి మెరుగైన వసతులతో ప్రజలకు విశేష సేవలందిస్తోంది. అధునాతన వైద్య కేంద్రంగా రూపాంతరం చెందుతోంది. రోగులు సైతం సత్వరం ఉపశమనం పొందేలా మౌలిక వసతుల కల్పన జరుగుతోంది. వ్యాధి నయం కావడానికి కేవలం ఔషధాలు సరిపోవని, వారికి కాస్త ఆటవిడుపు, విరామం అందించే కార్యక్రమాలు అవసరమనే విషయాన్ని గుర్తించి, అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నారు.

రిక్రియేషన్ కోసం..

ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్‌గా చేరిన రోగులు దీర్ఘ కాలం పాటు వైద్యం పొందుతారు. ఈ క్రమంలో వారు ఆస్పత్రిలోని వార్డులో ఉంటారు. బాహ్య ప్రపంచానికి దూరంగా ఆస్పత్రిలో ఉండిపోవడంతో వారికి మానసికంగా కొంత ఇబ్బందికరంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రోగులకు కాస్త ఆటవిడుపుగా ఉండేలా ప్రత్యేక వసతులను కల్పిస్తున్నారు. దీనికోసం ఆస్పత్రి ఆవరణలో ఉన్న ప్రత్యేకంగా రిక్రియేషన్ రూంకు పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దీనిలో ప్రత్యేకంగా మినీ థియేటర్, రీడింగ్ ఏరియా, ప్లే ఏరియా ఏర్పాటు చేస్తున్నారు. వారంలో ఒక రోజు టీవీలో సినిమాలు వేయడం, వివిధ కార్యక్రమాలు ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. కొంత వరకు వ్యాధి నివారణ అయిన వారికి స్ఫూర్తినందించే నిపుణుల ప్రసంగాలు సైతం ఇక్కడ ప్రసారం చేసే విధంగా అధికారులు కృషి చేస్తున్నారు. వార పత్రికలు, పుస్తకాలు, ప్రత్యేక సంచికలు ఉంచి రోగుల్లో పఠనాసక్తిని కలిగించే విధంగా రీడింగ్ ఏరియాను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు చిన్నపాటి ఇండోర్ గేమ్స్ ఆడుకులా ప్రత్యేక సదుపాయాలను ఏర్పాడు చేస్తున్నారు.



రోగుల కోసం ఏర్పాటవుతున్న రిక్రియేషన్ రూం

పీజీ విద్యార్థులకు ఉపయుక్తంగా..

ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో పీజీ సైక్రియార్టీ కోర్సు చేస్తున్న విద్యార్థులకు ఉపయుక్తంగా ప్రత్యేకంగా డిజిటల్ లైబ్రరీని సిద్ధం చేశారు. కోర్సులో భాగంగా విద్యార్థులు చదవుకోవడానికి తమకు అవసరమైన సమాచారాన్ని కంప్యూటర్ నుంచి ఇంటర్నెట్ సాయంతో పొందే విధంగా ఈ డిజిటల్ లైబ్రరీ పని చేస్తుంది. పీజీ విద్యార్థులు, డాక్టర్స్, నర్సింగ్ సిబ్బంది, ఆయాలు తమ వస్తువులను భద్రపరుచుకునే విధంగా ప్రత్యేక లాకర్లను ఏర్పాటు చేశారు. భోజన విరామ సమయంలో వైద్యులు కాస్త సేదతీరడానికి ఇవి ఉపయుక్తంగా నిలుస్తున్నాయి. వీటితో పాటు టెలికాన్ఫరెన్సింగ్ హాల్, కాన్ఫరెన్స్ హాల్‌లను సైతం పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి, సుందరంగా తీర్చిదిద్దారు.

పాఠశాలల్లో పంద్రాగస్టు సందడి



గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

ఆ మైదానంలో నవ్వులపూలు సందడి చేశాయి... కేరింతలతో ముచ్చటగొలిపాయి. ఇదంతా గోపాలపట్నం హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో బుధవారం కనిపించిన దృశ్యాలు. ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. దీంతో ఈ ప్రాంగణం విధంగా సందడిగా మారింది. కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ వంటి పలు పోటీలు నిర్వహించారు.

- గోపాలపట్నం

స్టీల్ సిటీ డిపో కార్మికులకు సంఘీభావం

మల్కాపురం: స్టీల్‌సిటీ డిపో యాజమాన్యం మొండి వైఖరిని విడనాడాలని ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి జి.ఆర్.రావు అన్నారు. స్టీల్‌సిటీ డిపో యాజమాన్యం తీరును నిరసిస్తూ డిపో కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా బుధవారం గాజువాక డిపో వద్ద ఎన్ఎంయూ కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. రీజినల్ కమిటీ పిలుపు మేర జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ స్టీల్‌సిటీ డిపోలో పని చేస్తున్న కార్మికులకు కనీస వసతులు కల్పించడం లేదని ఆరోపించారు. అధిక గంటలు పని చేయించుకుంటున్నా.. ఓటీ ఇవ్వడం లేదన్నారు. కండీషన్‌లో లేని బస్సులను మెరుగు పరచాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ వైస్ ప్రెసిడెంట్ బి.ఎం.రావు, జోనల్ ముఖ్య ఉపాధ్యక్షుడు సి.పి. కుమార్, జోనల్ ప్రచార కార్యదర్శి పి.ఎ.షరీఫ్, డివిజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్, రీజినల్ నాయకలు కె.వి.రాజు, సీసీఎస్ డెలిగేట్ యు.వి.ఎల్.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో మహిళల కృషి ప్రశంసనీయం

- స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్
- ఘనంగా విప్స్ ఆవిర్భావ వేడుకలు



విప్స్ వేడుకల్లో ప్రసంగిస్తున్న లా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ శ్రీసుధ

ఉక్కునగరం: మహిళలు సమాజంలో అంతర్భాగంగా ఉంటూ దేశ ప్రగతిలో విశేష పాత్ర పోషిస్తున్నారని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ కొనియాడారు. స్టీల్‌ప్లాంట్ విమన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ (విప్స్) 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎల్‌డీసీ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సామాజిక, రాజకీయ, వ్యాపార, వ్యవస్థాపక రంగమైనా, జీవితంలోని ప్రతి రంగంలో మహిళలు తమకంటూ ఒక గుర్తింపును ఏర్పరుచుకోవడం సంతోషకరమన్నారు. భారత ప్రభుత్వం కూడా లింగ సమానత్వం, మహిళా సాధికారతను సృష్టించడంలో సహాయపడే విధానాలను ప్రారంభించి మహిళలను ప్రోత్సహిస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లోని మహిళా ఉద్యోగుల సంస్థల ప్రగతి కోసం విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. విశిష్ట అతిథి, దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ పి. శ్రీసుధ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు సాధించిన విజయాలను కొనియాడారు. ప్రభుత్వరంగ విభాగాల్లో ఉన్నత యాజమాన్య పదవుల్లోకి ఎదిగి, మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాతీయ, ప్రాంతీయ స్థాయిల్లో మహిళా ఉద్యోగులు గెలుచుకున్న వివిధ అవార్డుల గురించి తెలియజేశారు. 35 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 19మంది మహిళా ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా మహిళా ఉద్యోగులకు జేసీఐ, ప్రాజెక్ట్ స్మూత్ వాక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు డి.కె.మొహంతి, ఎ.కె.బాగ్చీ, సురేష్ పాండే, ఉన్నతాధికారులు, విప్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్విట్ అదానీ.. సేవ్ వర్కర్స్

నినదించిన గంగవరం పోర్టు కార్మికులు



మానవహారంగా ఏర్పడిన గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: 'క్విట్ అదానీ.. సేవ్ వర్కర్స్', 'క్విట్ మోదీ.. సేవ్ ఇండియా' నినాదాలతో పోర్టు కార్మికులు నినదించారు. అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలు బుధవారానికి 37వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో భాగంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పెదగంట్యాడ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. యాజమాన్యం వెంటనే స్పందించి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొవిరి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ, మాద అప్పారావు, సత్యానందం, నొల్లి స్వామి, పేర్ల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో పూజా రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

మహోద్యమ దిశగా ఉక్కు దీక్షలు



909వ రోజు దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు దీక్ష మహోద్యమం దిశగా మారనుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 909వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడు తూ ఉక్కు ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం ఎన్ని అవరోధాలు సృష్టించినా నిలదొక్కుకుని విజయపరంపరలో కొనసాగుతోందన్నారు. నిర్వాసితులకు, కార్మికులకు అన్యాయం చేస్తూ సంస్థను అమ్మడం దుర్మార్గమని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం '

అక్కిరెడ్డిపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై భెల్ ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. సంస్థ ప్రధాన గేటు వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలన్నీ నాశనం అయిపోతున్నాయన్నారు. ఎంతో పోరాడి సాధించుకున్న సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. నెహ్రూ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపిస్తే మోదీ హయాంలో సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తున్నారని దుయ్యబట్టారు. దీనికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వి.ఆనందరావు, ఎస్.జగన్నాథరావు, సీతంనాయుడు, ఎస్.ఎల్.నర్సింహులు, చిట్టిబాబు, మురళీశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పంచాయతీ కార్యదర్శి మృతి

గోపాలపట్నం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన గంట కృష్ణ(47) నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విమాన్‌నగర్‌లో నివాసముంటున్న గంటా కృష్ణ చోడవరం మండలం జన్నవరంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి విధులు పూర్తి చేసుకుని ఇంటికి బయలుదేరారు. ఎన్ఏడీ జంక్షన్‌లో బస్సు దిగి ఆటోలో విమాన్‌నగర్ బస్‌స్టాప్ వద్దకు చేరుకున్నాడు. రోడ్డు దాటుతుండగా ఎన్ఏడీ నుంచి వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టడంతో తలకు, శరీరంపై పలు చోట్ల గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నగరంలో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. బుధవారం కృష్ణ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్ పర్యవేక్షణలో ఎస్ఐ మోహనరావు దర్యాప్తు చేట్టారు.

బాధ్యతగా పనిచేయడమే దేశభక్తి



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ఆర్మీ ఉద్యోగి గుజ్జారి

మల్కాపురం: నా మట్టి- నా దేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి గుజ్జారి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశభక్తి అంటే దేశ సరిహద్దుల్లో కాపలా కాయడం ఒక్కటే కాదని, ఎవరి విధిని వారు చిత్తశుద్ధితో నిర్వహించడమేనని అన్నారు. సమాజంలో చెడును ప్రశ్నించాలని, సమాజ అభివృద్ధికి అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ సరిహద్దుల్లో రక్షణ ఎంత అవసరమో, దేశం లోపల క్రమశిక్షణాయుతమైన జీవితం కూడా అంతే ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్.బాగ్యలక్ష్మి,వై.అనసూయాదేవి,అంజలిదేవి,ఎం.నదియా,ఎ.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

చీటీల నిర్వాహకులపై కేసు నమోదు చేయాలి

- పోలీస్ స్టేషన్ వద్ద బాధిత మహిళల నిరసన

సింహాచలం: తమను మోసగించిన చీటీల నిర్వాహకులపై కేసు నమోదు చేయాలని పెందుర్తి పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం రాత్రి పలువురు మహిళలు నిరసన వ్యక్తం చేశారు. బాధిత మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. పెందుర్తికి చెందిన పద్మావతి అనే మహిళ వద్ద చీటీలు కట్టారు. సుమారు నాలుగు కోట్లు వరకు చీటీల పేరిట ఆమె వసూలు చేసిందన్నారు. నెల రోజుల నుంచి పద్మావతి కనిపించలేదన్నారు. ఫోన్ కూడా పని చేయడం లేదని వాపోయారు. దీంతో వరలక్ష్మి పార్టనర్‌గా ఉన్న వ్యక్తిపై గత నెల 21న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ కేసు విషయంపై పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో మళ్లీ ధర్నా చేయగా పోలీసులు సదరు వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించారన్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కేసుపై విచారణ చేస్తున్నామని ఎస్ఐ అసిరి తాత తెలిపారు.

అంకుర సంస్థలకు ఆ హబ్ సాయం

ఏయూ క్యాంపస్: యువత స్థాపించి, నిర్వహిస్తున్న అంకుర సంస్థల(స్టార్టప్)కు ఆర్థిక సహకారాన్ని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ఏయూ ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు ఒక ప్రకటనలో తెలిపారు. భారత శాస్త్ర సాంకేతిక విభాగం ఏర్పాటు చేసిన నిధి పథకంలో భాగంగా యువత ఆలోచనలు, ఆవిష్కరణలుగా, ఉత్పత్తులుగా మార్చడానికి అవసరమైన మూలధనం అందిస్తామన్నారు. కనిష్ఠంగా రూ.2 లక్షలు, గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు అందిస్తామని పేర్కొన్నా రు. టెక్నాలజీ, సైన్స్ ఆధారంగా పనిచేసే అంకుర సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సాంకేతిక ఆధారిత ఆవిష్కరణలకు ఫొటోటైప్ ఉత్పత్తిని 12 నెలలో తీసుకురావాల్సి ఉందన్నారు. దీనికి ఐవోటీ అనుసంధానం తప్పనిసరని అన్నారు. పూర్తి వివరాలకు ఏయూ ఆ హబ్‌లో నెలకొల్పిన ఏయూ నిధి ఐటీబీఐ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

నేడు ఏయూలో ఉద్యోగ మేళా

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో, మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్ ఇండియా సంస్థలో ఫార్మాసిస్ట్, ఫార్మసీ ఎయిడ్, సీఏస్, డెలివరీ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. మొత్తం 90 ఖాళీలను భర్తీ చేస్తామని, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ కోర్సులను పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునన్నారు. నెలకు రూ.11,080 నుంచి రూ.16 వేలు మధ్య వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు ncs. gov. in వెబ్‌సైట్ లో వివరాలు నమోదు చేసుకుని గురువారం ఉదయం 10.30 గంటలకు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. పూర్తి సమాచారం కోసం 96660 92491 నంబరులో సంప్రదించాలన్నారు.

'అర్హులందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలి'

జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



వెలంపేట ఏరియాలో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ సూచించారు. దక్షిణ నియోజకవర్గంలోని వెలంపేట పరిధిలో 91, 98 పోలింగ్ బూత్‌ల పరిధిలో నిర్వహించిన ఇంటింటికీ ఓటరు సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బీఎల్‌వోలు డోర్ టు డోర్ వెరిఫికేషన్‌కు వచ్చినప్పుడు ఓటరు వివరాలు, డోర్ నెంబరు సరిగ్గా ఉన్నది, లేనిదీ పరిశీలించుకోవాలన్నారు. పాత ఓటర్ల వివరాలు, కొత్తగా చేరిన వారి నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటు అనేది భారత రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు అని, కుటుంబంలో 18 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, మహారాణిపేట తహసీల్దార్ టి.ఆనంద్ కుమార్, బూత్ లెవెల్ అధికారులతో పాటు బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

సింహాచలేశుడికి వైభవంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతధారణ చేస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు చక్రవర్తి తదితరులు ఈసేవ నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడ సేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తరశత నామావళి పూజని నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

ఘనంగా సహస్రనామార్చన

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం సహస్ర నామార్చన విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులకు 1001 నామాలతో పూజ చేసి హారతులు అందజేశారు.